క్లుప్తంగా

రాజీ పడితేనే కేసులు రద్దు

జడ్జి శివరంజని



మాట్లాడుతున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్: కక్షిదారులు రాజీ పడితేనే కేసులు రద్దు చేస్తామని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శివరంజని అన్నారు. శనివారం హుస్నాబాద్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంతంలో డ్రంకెన్ డ్రైవ్, లిక్కర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. కేసుల భారం తగ్గించాలనే ఉద్దేశ్యంతో సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతీ మూడు నెలలకోసారి సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జడ్జి కృష్ణతేజ్, ఏపీపీ రవికిరణ్, ఏజీపీ రామకృష్ణ, సీఐ ఎర్రల కిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, అక్కన్నపేట ఎస్ఐ వివేక్, న్యాయవాదులు సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు చదువులో భాగం కావాలి



మాట్లాడుతున్న సీఐ జానకిరాంరెడ్డి

వర్గల్(గజ్వేల్): విద్యార్థిదశలో చదువుతోపాటు క్రీడలు భాగం కావాలని తద్వారా విద్యపై ఆసక్తి పెంపొందుతుందని గజ్వేల్ రూరల్ సీఐ జానకిరాంరెడ్డి అన్నారు. శనివారం వర్గల్ జెడ్పీ హైస్కూల్‌కు శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ రూ.10 వేల విలువైన క్రీడాసామగ్రి అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ విష్ణుజగతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడావికాసానికి బాసటగా తమ ట్రస్ట్ ముందుకు సాగుతోందన్నారు. వీలైనన్ని పాఠశాలల్లో క్రీడాసామగ్రి పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్‌గౌడ్, ట్రస్ట్ ప్రతినిధులు సత్యనారాయణ, గోపాల్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో రెండేళ్ల జైలు

చిన్నకోడూరు(సిద్దిపేట): పోక్సో కేసులో నేరం రుజువైనందున నిందితుడికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు చిన్నకోడూరు ఎస్ఐ సుభాష్ గౌడ్ శనివారం తెలిపారు. మండల పరిధిలోని కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన సంపంగి స్వామి గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను కొద్దిరోజులుగా అత్యాచారం చేయడమేకాకుండా వేధిస్తున్నాడని 2021 సెప్టెంబర్ 6న బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేశారన్నారు. కేసు దర్యాప్తు చేసిన నాటి సీఐ, ప్రస్తుత ఏసీపీ సురేందర్‌రెడ్డి నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించి చార్జీషీట్ వేశారన్నారు. శనివారం విచారించిన మొదటి అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు జడ్జి నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

డీజిల్ చోరీ

దుబ్బాక: దుబ్బాక మార్కెట్ యార్డులో పార్కింగ్ చేసిన రెండు డీసీఎం వాహనాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ చోరీ చేశారు. దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక పట్టణానికి చెందిన కంతుల రమేష్ రోజూ మాదిరిగానే తన రెండు డీసీఎంలను దుబ్బాక వ్యవసాయ మార్కెట్‌లో నిలిపి ఉంచాడు. శుక్రవారం రాత్రి దుండగులు రెండు డీసీఎంల డీజిల్ ట్యాంక్‌ల తాళాలను పగలగొట్టి 150 లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. డీసీఎం యజమాని శనివారం దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పాత సర్వే ప్రకారం పనులు చేయాలి



ధర్నా చేస్తున్న రైల్వే భూ సేకరణ బాధితులు

సిద్దిపేట జోన్: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి శివారులో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు పాత సర్వేకు అనుగుణంగా చేపట్టాలని రైల్వే భూసేకరణ బాధితులతో కలిసి కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆర్డీఓ, ఎమ్మెల్యే స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చంద్రం, పట్టణ అధ్యక్షుడు అత్తు మాట్లాడారు. మిట్టపల్లి శివారులో రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం గతంలో సర్వే చేసిన దానికి అధికంగా 50 ఫీట్లతో బ్రిడ్జి పనులు చేసే ఆలోచనలో ఉందని, సమీప నివాస ప్రజలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ధర్నాలో జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మీ పాల్గొన్నారు.

కల్తీ పాలు సరఫరాపై గందరగోళం

- డెయిరీకి వచ్చిన 52 డబ్బాల పాలు
- కల్తీ అయ్యాయని మేనేజర్ తిరస్కరణ
- ఆందోళనలో పాల ఉత్పత్తిదారులు
- స్వయంగా పరీక్షించిన జిల్లా డీడీ గోపాల్ సింగ్



పాల ఉత్పత్తిదారులతో మాట్లాడుతున్న డీడీ గోపాల్‌సింగ్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ అనుబంధ ×విజయ డెయిరీ౯ చేర్యాల పాలశీతలీకరణ కేంద్రం (బీఎంసీ)కు కొన్ని డబ్బాల ద్వారా కల్తీ పాలు సరఫరా అవుతున్న విషయంపై గతకొద్ది రోజులుగా గందరగోళం నెలకొంది. ఇటీవల చేర్యాల నుంచి హైదరాబాద్ ప్రధాన కేంద్రానికి పంపించిన పాల ట్యాంకర్‌లో పాలు కల్తీ అయ్యాయని గుర్తించిన అధికారులు పాలను వెనక్కి పంపారు. ఈ విషయం మరింత ఆందోళనకు దారితీసింది. శుక్రవారం స్థానిక కేంద్రానికి తెచ్చిన వివిధ గ్రామాలకు చెందిన 52 డబ్బాల పాలల్లో ఉప్పు, చక్కెర కలిసిందని డెయిరీ మేనేజర్ అభ్యంతరం తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు కేంద్రానికి చేరుకుని మేనేజర్ మురళితో వాగ్వాదానికి దిగారు. కనీస పరీక్షలు చేయకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రతీరోజు పరీక్షలు చేసి, కల్తీ అని తేలితే ఆ పాలను ప్రధాన కేంద్రానికి సరఫరా చేయొద్దన్నారు. పరీక్షలు చేయడంలో నిర్లక్ష్యం ఏమిటని రెండు గంటల పాటు మేనేజర్‌తో వాగ్వాదం చేశారు. ఇకపై కల్తీలేని పాలసేకరణకు అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించి, కల్తీ పాలుగా గుర్తించిన పాలను శుక్రవారం రాత్రి కేంద్రం ఆవరణలో పారబోశారు. ఇది ఇలా ఉంటే శనివారం ఉదయం మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి తెచ్చిన పాలను పరీక్షించిన మేనేజర్ పాలు కల్తీ అయ్యాయని చెప్పడంతో ఉత్పత్తిదారులు ఆందోళనకు దిగారు. పరీక్షల్లో తప్పు ఉండవచ్చన్న అనుమానం కూడా వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ సింగ్ కేంద్రానికి వచ్చి రైతులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. వారు వినకపోవడంతో ఉత్పతిదారుల వెంట గ్రామానికి వెళ్లిన ఆయన పలువురు రైతులకు చెందిన ఆవుల పాలు పిండి అక్కడే పరీక్షలు నిర్వహించగా పాలు శుద్ధిగా ఉన్నట్లు గుర్తించారు. తిరిగి కేంద్రానికి వచ్చి కేంద్రంలో ఉన్న పాలను పరీక్షించగా కల్తీ ఉన్నట్లు నిర్ధారించారు. దీనిపై గోపాల్ సింగ్ మాట్లాడుతూ కేంద్రం పరిధిలోని కొన్ని గ్రామాల్లో పాలు కల్తీ జరుగుతున్నట్లు తాము నిర్ధారణకు వచ్చామన్నారు. ఆ గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి కల్తీ నివారణకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పాడిరైతుల ఆందోళన

సేకరించిన పాలను పారబోయడంపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న పాడి రైతులు

మద్దూరు(హుస్నాబాద్): పాలకేంద్రానికి సరఫరా చేసిన పాలను పారబోయడంతో పాడిరైతులు ఆందోళనకు దిగారు. మద్దూరు మండల పరిధిలోని లద్నూర్ గ్రామంలోని విజయ పాల డెయిరీకి 140 మంది పాడి రైతులు ప్రతీరోజు 1,300 లీటర్ల పాలను విక్రయిస్తున్నారు. ఇందులో 440 లీటర్ల ఆవుపాలు, మిగతావి గెదే పాలు. కాగా ఈనెల 28, 29, 30 తేదీల్లో రైతులు తెచ్చిన పాలను సేకరించి చేర్యాల బీఎంసీకి తరలించారు. పాలల్లో ఉప్పు కలిసిందంటూ బీఎంసీ నిర్వాహకులు మూడు రోజులుగా 440 లీటర్ల చొప్పున 1,320 లీటర్ల పాలను పారబోశారు. ఈ విషయం తెలుసుకున్న పాడి రైతులు శనివారం లద్నూర్ పాల డెయిరీ వద్ద నిరసనకు దిగారు. ఈ విషయంపై విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్‌సింగ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా పాలలో ఉప్పు కలిసిందని, అందుకే తిరస్కరించినట్లు చెప్పారు. పూర్తి వివరాలు తెలుసుకొని సమస్యను పరిష్కరిస్తామన్నారు. గతంలో లద్నూర్ విజయ పాల డెయిరీలోని పాలను శీతలీకరణ చేసే యంత్రాన్ని విద్యుత్ బిల్లు సాకుతో చేర్యాలకు తరలించినట్లు పాడిరైతులు తెలిపారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఉత్తమ పాల సేకరణ కేంద్రంగా పేరుగాంచిన లద్నూర్ గ్రామ విజయ పాల డెయిరీపై నిందలు వేయడం సరికాదని పాడిరైతులు వాపోతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



ఆసుపత్రి అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గన్నె వనిత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తీర్మానాలపై ప్రత్యేకంగా చర్చించారు. కాగా మున్సిపల్ సమావేశానికి తొలిసారిగా హాజరైన కొత్త ప్రభాకర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా కొత్తగా రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

దుబ్బాక ప్రభుత్వ వందపడకల ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే హాజరై ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షించారు. వైద్యులు, సిబ్బంది కొరతతో వైద్యసేవలు అందడంలేదని ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని పోతారంగా గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, ఆరోగ్య ఉపకేంద్రం, పాఠశాలలో అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఆరు గ్యారంటీల పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయాలి

తొగుట(దుబ్బాక): విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని వెంకట్రావుపేట సర్పంచ్ పాత్కుల లీలాదేవి అన్నారు. గ్రామంలోని లిటిల్ బర్డ్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రిస్మా జిల్లా అధ్యక్షుడు శంకర్, కోశాధికారి రాజు, ప్రిన్సిపాల్ బిక్కనూరి అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి రైతుల ఆందోళన

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని అహ్మద్‌నగర్ సమీప పత్తి జిన్నింగ్ మిల్లుకు పత్తిని తెచ్చి రైతులు విక్రయిస్తుంటారు. శనివారం పత్తిని విక్రయిస్తున్న క్రమంలో క్వింటాల్ తూగాల్సిన పత్తిని 80 నుంచి 90 కిలోలుగా తూకం వేస్తుండటంతో అనుమానం వ్యక్తం చేశారు. మిల్లు యజమానులు దోపిడీ చేస్తున్నారని ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగారు. మిల్లుపై చర్యలు తీసుకుని నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మిల్లు గేటుకు తాళం వేసి నిరసన చేపట్టారు. రైతులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని దౌల్తాబాద్ ఎస్ఐ తెలిపారు.

కౌలు రైతు మృతి

సిద్దిపేటరూరల్: చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి చెందాడు. ఈ ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తొగుట మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన దొంతి శ్రీనివాస్ (35) సిద్దిపేట కోమటి చెరువు వద్ద పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీన ఘనపూర్ నుంచి పొలానికి వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గం మధ్యలో వెంకటాపూర్ గ్రామం వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన శ్రీనివాస్ భార్య సేనవ్వ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అంబులెన్స్‌లో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కి తరలించాలని సిఫారసు చేశారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల హాస్టల్‌లో తాగునీటికి కటకట



మద్దూరులోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలోని బాలికల వసతి గృహంలో నీటి కటకటతో విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారు. మద్దూరు మోడల్ స్కూల్‌లో చదివే టెన్త్, ఇంటర్ విద్యార్థినులకు పాఠశాల ఆవరణలోనే వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 48 మంది ఉంటున్నారు. హాస్టల్‌కు అనుబంధంగా బోరు వేయడం మర్చిపోయారు. దీంతో తాగునీరు, ఇతర అవసరాలకు, వంటల తయారీకి మిషన్ భగీరథ వాటర్‌పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. 15 రోజులుగా నీరు సరఫరా కాకపోవడంతో విద్యార్థినులు నానా అవస్థలుపడుతున్నట్లు సమాచారం. హాస్టల్‌లో నీరు తమ పిల్లలు అవస్థలుపడుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హాస్టల్ వార్డెన్‌ను సంప్రదించగా నీటి సమస్య తీవ్రంగా ఉందన్నాడు. విషయం తెలుసుకున్న బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్ వసతి గృహాన్ని సందర్శించి, వెంటనే అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

సేవాలాల్ పేరుతోనే జీపీ ఏర్పాటు చేయాలి



ఆందోళన చేస్తున్న గిరిజనులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని నందారం స్టేజీ వద్ద పునరావాసకాలనీ, బంగారులొద్ది తండాలను కలుపుతూ 'సేవాలాల్ మహారాజ్' తండా పేరుతోనే జీపీ ఏర్పాటు చేయాలని శనివారం గిరిజనులు ఆందోళనకు దిగారు. గత బీఆర్ఎస్ పార్టీ హయాంలో సేవాలాల్ మహారాజ్ తండాను జీపీగా ఏర్పాటుకు ప్రతిపాదించగా, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ స్థానంలో ముంపు గుడాటిపల్లి గ్రామ పేరుతో జీపీగా ఏర్పాటుకు ప్రతిపాదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సర్పంచ్ రాజిరెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ 95 శాతం గిరిజనులు నివసిస్తున్న తండాల్లో ముంపు గుడాటిపల్లి గ్రామ పేరును జీపీగా ఏర్పాటుకు ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ పేరును అవమానించినట్లుగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ విషయంపై త్వరలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వివరిస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు భానోతు భాస్కర్‌నాయక్, హరిలాల్, లావ్డి మహేశ్ తండావాసులు, మహిళలు పాల్గొన్నారు.

జనవరి 2న మళ్లీ ప్రజాపాలన



పత్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్

సిద్దిపేటజోన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం, కొత్త సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో రెండు రోజుల పాటు పట్టణంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు సెలవు దినాలుగా ప్రకటించినట్లు మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని పలువార్డుల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తులు జనవరి 6వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు తీసుకుంటారన్నారు.

సాగు నీరందించాలి

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ ఈఈ సాయిబాబాను ఎల్లారెడ్డిపేట ఎంపీటీసీ వేల్పుల స్వామి ఆధ్వర్యంలో రైతులు శనివారం కలిశారు. యాసంగి సాగుకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కోరారు. కాలువ ద్వారా బొల్లక్క చెరువులోకి మల్లన్న సాగర్ నీటిని వదిలితే రైతులు నాట్లు వేసుకుంటారన్నారు.

అర్హులైన నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



రసులాబాద్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): అర్హులైన ప్రతీ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రసులాబాద్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరిస్తున్న అభయహస్తం దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతీ కుటుంబం నుంచి దరఖాస్తు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కు సూచించారు. రాజకీయాలతీతంగా పనిచేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల తాడిచెట్టు పైనుంచి జారిపడిన మల్లయ్యను పరామర్శించారు. అతడికి రావల్సిన ఎక్స్‌గ్రేషియా రాకపోవడంతో ఎక్సైజ్ అధికారి ఫోన్ చేసి మాట్లాడారు. వీలైనంత త్వరగా ఎక్స్‌గ్రేషియా మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీరాంరెడ్డి, ఎంపీడీఓ అనురాధ, ఏఓ నరేష్, వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ములుగు(గజ్వేల్): ప్రజాపాలనలో ప్రజలు ఇబ్బందిపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ అన్నారు. శనివారం మండలంలోని అచ్చాయిపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల్లో కుటుంబాలకు సరిపడా దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఆర్ఐ నరేందర్, సర్పంచ్ రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రజాపాలన అర్జీల స్వీకరణ కొనసాగుతోంది. దరఖాస్తుల స్వీకరణ తీరును ఆర్డీఓ రమేశ్, ప్రత్యేకాధికారులు పర్యవేక్షించారు. పుల్లూరు, రాఘవాపూర్ గ్రామంలో జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు సూర్యవర్మ పరిశీలించి, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రమేశ్, ఉదయశ్రీ తిరుపతి, నాగరాజు, ఎంపీడీఓ కుమారస్వామి, ఎమ్మార్వో సలీం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో కొనసాగుతోంది. ఆరు గ్యారంటీ స్కీంలకు ప్రజలు దరఖాస్తులు అందిస్తున్నారు. దరఖాస్తుల కౌంటర్లను తహసీల్దార్ గోవర్దన్, ఎంపీడీఓ రాజిరెడ్డి, ఆయా కార్యదర్శులు పర్యవేక్షించారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి, మోత్కుపల్లి, గొల్లపల్లి, పెద్దతండా గ్రామాల్లో శనివారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. మల్లంపల్లిలో 441, గొల్లపల్లిలో 86, పెద్దతండాలో 106, మోత్కులపల్లిలో 141 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి తెలిపారు.

గజ్వేల్‌రూరల్: ప్రజాపాలన కార్యక్రమం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతోంది. మండల పరిధిలోని కొడకండ్ల, అక్కారం గ్రామాల్లో ఎంపీడీఓ మచ్చేందర్, రిమ్మనగూడ, దాతర్‌పల్లి గ్రామాల్లో తహసీల్దార్ బాల్‌రాజు పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి



మద్దూరు(హుస్నాబాద్): శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరుకొని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ అన్నారు. శనివారం దూల్మిట్ట మండలం కొండాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హ్యూమన్ ట్రాఫికింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ బాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవద్దన్నారు. సెల్‌ఫోన్ అవసరాల మేరకు ఉపయోగించాలని సైబర్ నేరాలకు గురుకావద్దన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల రక్షణకు షీటీం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కావెంజర్ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి దేశిరెడ్డి శనివారం తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణత లేదా ఫెయిలై వయస్సు 25 నుంచి 45 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. అభ్యర్థులు హుస్నాబాద్ మండలానికి చెందినవారై ఉండాలన్నారు. దరఖాస్తులను జనవరి 2 నుంచి 5వ తేదీలోగా కేజీబీవీలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 74164 93220 సంప్రదించాలని పేర్కొన్నారు.

◆ బెస్ట్ రీజియన్ చైర్మన్ అవార్డు

సిద్దిపేటజోన్: ఏపీలోని విజయవాడలో శనివారం నిర్వహించిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ విజయభేరీ అవార్డుల ప్రదానం కార్యక్రమంలో సిద్దిపేటకు చెందిన పుల్లూరి శివకుమార్‌కు బెస్ట్ రీజియన్ చైర్మన్ అవార్డు లభించింది. ఈ అవార్డు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు గాయత్రి చేతుల మీద అవార్డ్ అందుకున్నారు. క్లబ్ సేవలను మరింత విస్తరిస్తామని శివ కుమార్ చెప్పారు.

◆ ఆర్థిక సహాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల అటెండర్ శరవయ్య కుటుంబానికి శనివారం గ్రామస్తులు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల శరవయ్య అనారోగ్యంతో మరణించాడు. గ్రామస్తులు చందాలు వేసుకుని రూ. 58 వేలు అందజేశారు.

◆ రవాణా సౌకర్యం కల్పించాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లెలో నిర్వహించే సమ్మక్క-సారాలమ్మ జాతరకు వెళ్లే మార్గంలో నక్ష దారిని గుర్తించి రవాణా సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంటనే స్పందించి తహసీల్దార్ శ్యామ్‌తో మాట్లాడారు. సమ్మక్క-సారాలమ్మ జాతర ఉన్నందున సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు.

◆ అక్షింతల ఊరేగింపు

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో అయోధ్య రామమందిర ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిన ప్రతిష్ఠ అక్షింతలను శనివారం ఊరేగింపుగా రామాలయానికి తెచ్చారు. ఊరేగింపు కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ సమీప ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి గ్రామ వీధుల గుండా సీతారామచంద్ర స్వామి దేవాలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాచం నవీన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండు రంగం, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

◆ క్రీడాసామగ్రి అందజేత

ములుగు(గజ్వేల్): మండల కేంద్రమైన ములుగులోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు శనివారం శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ క్రీడా సామగ్రిని అందజేసింది. కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ జానకిరాంరెడ్డి, ట్రస్టు చైర్మన్ విష్ణుజగతి, హెచ్ఎం ఉదయబాస్కర్ రెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు గోపాల్, సత్యనారాయణగౌడ్, హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

